క్లుప్తంగా

జడ్జిని కలిసిన ఎస్ఐ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని కోర్టులో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ ఉమర్‌ను శుక్రవారం స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు కలుసుకున్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌కు, కోర్టు సంబంధిత కేసులు సత్వర పరిష్కారంపై చర్చించారు. పెండింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ గురించి మాట్లాడారు.

ఎస్ఐకి ఘన సన్మానం



మరికల్: మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మురళిని శుక్రవారం పలు రాజకీయ పార్టీల నాయకులతోపాటు వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాసల రామేశ్వర్‌రెడ్డి, శ్రీను, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ఎస్ఐగా మహ్మద్ నవీద్

కృష్ణా: మండల ఎస్ఐగా షేక్ మహ్మద్ నవీద్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు తనకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



ఊట్కూరు: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా ఎన్నికైనా కొండేటి శ్రీధర్ మాజీ ఎమ్మెల్యేను శుక్రవారం మండలానికి చెందిన దళిత మోర్చ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బి. కృష్ణ, జిల్లా కార్యదర్శి కొండన్, గోపాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా పఠనం

మరికల్: భక్తిభావాన్ని పెంపొందించేందుకు హనుమాన్‌వాడ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి హనుమాన్ చాలీసా పఠనం ఉంటుందని ఆలయ భక్త మండలి సభ్యులు శుక్రవారం తెలిపారు. హనుమాన్ చాలీసా పుస్తకాలను మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు దత్తాత్రేయ ఆలయానికి అందజేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రతి శనివారం ఇక్కడ నిర్వహించే హనుమాన్‌చాలీసా పఠనంలో పాల్గొనాలని ఆలయ భక్తమండలి సభ్యులు పేర్కొన్నారు.

ఇసుకకుఅనుమతి ఇవ్వాలని వినతి



మాగనూర్: మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా తరలించుకునేందుకు ప్రతి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. అధికారులు స్పందించి గ్రామంలో గృహనిర్మాణాల కోసం ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్, డీటీ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

మాగనూర్: ఈ నెల 16న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ.. జిల్లా కన్వీనర్ పూంజనూర్ ఆంజనేయులు శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి విరోజకు సమ్మెనోటీస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలకు రూ. 26వేల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్‌లుగా మారుస్తూ నిర్ణయం తీసుకోవడంపై కార్మికులు పర్మినెంట్ కాకుండా అన్యాయానికి గురవుతున్నారన్నారు. అలాగే తదితర డిమాండ్‌లతో సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు అందని ఆహ్లాదం

● బిల్లుల కారణంగా పూర్తికాని ట్యాంక్ బండ్ పనులు



మినీట్యాంక్‌బండ్ ఆనకట్టపై ఏర్పాటు చేసిన రెయిలింగ్ (ఫైల్)



మరికల్‌లో ట్యాంకుబండ్ బతుకమ్మ ఘాట్ (ఫైల్)

మరికల్: నియోజకవర్గానికి ఒక చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా ఎంపిక చేసి పర్యాటకులకు అనుగుణంగా సుందరంగా తీర్చిదిద్ది ఆహ్లాదకరంగా మార్చాలని, ప్రజలు కుటుంబాలతో సహా వచ్చి సేద తీరేలా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం ప్రతి జిల్లాలోని మినీట్యాంక్‌బండ్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో రెండు చెరువులను అభివృద్ధి చేయడానికి 2015–16లో పనులు మంజూరు చేసింది. గత ఏడుసంవత్సరాల నుంచి పనులు నత్తనడకన సాగడంతో పర్యాటకులకు ఆహ్లాదం ఇప్పట్లో అందే పరిస్థితి కనిపించడం లేదు.

ఏడేళ్ల కిందట..

జిల్లాలో మక్తల్‌తోపాటు నారాయణపేట నియోజకవర్గంలో మరికల్‌కు మినీట్యాంక్‌బండ్‌ను మంజూరు చేసింది. ట్యాంక్‌బండ్ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి బిల్లులు జాప్యం కావడంతో కాంట్రాక్టర్లు త్వరగా పనులు పూర్తి చేయలేకపోయారు. గత ఏడాది జనవరి చివరి వరకు ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఆ దిశగా ప్రస్తుతం మక్తల్, మరికల్ ట్యాంక్‌బండ్ పనులు చేశారు. కాని బిల్లుల సకాలంలో రాకపోవడంతో అసంతృప్తిగా పనులు కొనసాగాయి.

మరికల్‌లో జరిగిన పనులు

నియోజకవర్గంలో మరికల్ పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపికచేసి రూ. 3.46 కోట్లు మంజూరు చేశారు. ఏడేళ్లు గడుస్తోంది. ఇప్పటివరకు ఆనకట్ట విస్తీర్ణ, తూములు, బతుకమ్మ ఘాట్, ఆనకట్ట రివింట్‌మెంట్, వాటర్‌వాల్స్ పనులు చేయగా 80శాతం పూర్తి కావచ్చింది.

చేయాల్సిన పనులు..

కట్టపై సీసీరోడ్డు నిర్మాణం, కట్టపై వెళ్లాడానికి ర్యాంపు, వ్యాకింగ్ ట్రాక్, ఆనకట్టపై కూర్చీలు, లైటింగ్ విధానం పనులు చేయాల్సి ఉంది. త్వరగా పనులు పూర్తికాకపోవడంతో కట్టపై పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు మొలచాయి. పనులు త్వరగా పూర్తికాకపోవడంతో ఇక్కడి ప్రజలకు నిరాశే మిగిలింది.

పూర్తి చేయిస్తాం..

ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. ఇటీవల జరిగిన పలు మండల సమావేశాల్లో మినీ ట్యాంక్‌బండ్ పనుల విషయంపై చర్చించాం. బిల్లుల జాప్యంతో పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. పెండింగ్ పనులు పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకోస్తాం.

- కిరణ్‌కుమార్, మిషన్ కాకతీయ డీఈఈ, మరికల్

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదోతరగతి ప్రత్యేక తరగతులకు వస్తున్న విద్యార్థులకు శుక్రవారం నుంచి మన పాలమూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఆల్పాహారం కార్యక్రమాన్ని ఆ ఫోరం అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సేవ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అలాగే పదిలో పదికి పది గ్రేడ్ సాధించిన విద్యార్థులకు హైదరాబాద్ కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్ చదివించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, హెచ్‌ఎం లక్ష్మి, నర్సింహులు, వెంకటేష్, మానేష్‌గౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పాహారం పెడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తుంది



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్

మాగనూర్: ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తుందని డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్ అన్నారు. మండలంలోని ఉపాధి హామీ పథకానికి సంబంధించి 13వ సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ ఏప్రిల్ 2022 –2023 వరకు జరిగిన పనులకు ఖర్చు చేసిన దానిపై ఈ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి అన్ని శాఖల అధికారుల అలసత్వం కన్పిస్తుందన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధించామన్నారు. 2022– 2023 పనులకు సంబంధించి మొత్తం రూ.43,311 రికవరీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ ఎంపీపీ తిప్పయ్య, సోషల్ ఆడిట్ అధికారులు రామకృష్ణ రెడ్డి, శ్రీనివాసరావు, జిల్లా అంబుడ్స్‌పర్సన్ అధికారి నాగిరెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్, ఈసీ ఊషన్న, టీఏలు మాణిక్‌రావు, హర్షవర్ధన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు

మరికల్: గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమని గ్రామాల అభివృద్ధిలో గ్రామస్తులు భాగస్వామ్యం కావాలని ప్రత్యేకాధికారులు కోరారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలను చేపట్టారు. గ్రామాల వారీగా అధికారులు పాఠశాలలు, నర్సరీలను, పారిశుద్ధ్యపనులు, చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వం అప్పగించిన విధులను న్యాయబద్ధంగా పూర్తి చేస్తామని అప్పంపల్లి ప్రత్యేక అధికారి శ్రీశైలం తెలిపారు.

నర్వ: మండలంలో ప్రత్యేక అధికారుల పాలనకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులకు గత పాలక సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారాలు శుక్రవారం నుంచి పాలన కొనసాగిస్తారని ఎంఈడీఓ సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని ఏఈ మారుతి, లంకాల్ ఎంపీఓ సుదర్శన్, పెద్దకడ్మూర్ సయీద్ ఇరిగేషన్ ఏఈ, ఉందేకోడ్ కృష్ణారెడ్డి, ఆర్ఐ, పాథర్చేడ్ చంద్రశేఖర్ ఏపీఎం, కల్వాల్ అశోక్ వెటర్నరీ డాక్టర్, యాంకి అరుణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్, రాయికోడ్ రాఘవేంద్ర సీనియర్ అసిస్టెంట్, రాంపూర్ జమీర్ సీనియర్ అసిస్టెంట్, కుమార్‌లింగంపల్లి అభిషేక్ కుమార్ సీనియర్ అసిస్టెంట్, బెక్కర్‌పల్లి భాస్కర్ సీనియర్ అసిస్టెంట్, కొత్తపల్లి శ్రీనివాసులు సీనియర్ అసిస్టెంట్‌లు ప్రత్యేక అధికారులుగా ఉంటారన్నారు.



నర్వలో బాధ్యతలు చేపట్టిన పీఆర్ ఏఈ మారుతి

ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

మాగనూర్: మండల వ్యాప్తంగా అన్ని పల్లెల్లో ప్రత్యేకాధికారుల పర్యావేక్షణలో పంచాయతీ పాలన సాగనుంది. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగిసిపోయింది. దీంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ కోయశ్రీహర్ష ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు వారిని శాలువాతో సన్మానించారు. గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ పాలన కొనసాగిస్తామని తెలిపారు.

స్వీపర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: తెలుగుగూడెంకి చెందిన స్వీపర్ మన్యంకొండ అనారోగ్యంతో మృతిచెందారని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో మన్యంకొండ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నర్సిములు, భాస్కర్, విజయ్‌కుమార్, నర్సిములుగౌడ్, వెంకటేష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల

ఆత్మకూర్:పట్టణంలో ప్రముఖ వాక్యోపదేశకులు, దైవానుజులు పాల్‌కిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8, 9 వ తేదీల్లో మూడురోజుల పాటు నిర్వహించనున్న యేసుప్రభు నామధ్యాస మహోత్సవానికి క్రైస్తవులు అధికసంఖ్యలో హాజరుకావాలని పాస్టర్ విద్యాసాగర్ కోరారు. మూలమళ్ల చర్చిలో మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

అందుబాటులో యూరియా

కోస్గి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు 45కిలోల యూరియా బస్తా ధర రూ.267లకు విక్రయిస్తున్నామన్నారు. యూరియా కావాల్సిన రైతులు భూమి పట్టాపాసు బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్‌తో వచ్చి కార్యాలయం నుంచి పొందవచ్చునన్నారు.

ఘనంగా ఉపాధిహామీ దినోత్సవం

నారాయణపేట రూరల్ : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధి కూలీలతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపాధిపనుల కారణంగా ఎంత మంది లబ్ధి పొందుతున్నారనే విషయం తెలియచేశారు. భవిష్యత్‌లో మరింత విస్తరించడానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత



అమరచింత: పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్ జిలాని వారం రోజుల కిందట పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను తిరిగి బాధితుడికి అందించామని ఏఎస్ఐ జమీరుద్దీన్ తెలిపారు. జిలానికి చెందిన సెల్‌ఫోన్ పట్టణంలోని ప్రధాన రహదారిపై బైక్ ప్రయాణిస్తుండగా పడిపోయిందన్నారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా తమ సిబ్బంది అరవింద్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని తిరిగి బాధితుడికి అందించడంలో కృషి చేశాడన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ పెన్షనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 4న టీఎన్‌జీఓ భవన్‌లో ఉదయం 8 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలుగౌడ్, బాల్‌కిషన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి రోడ్లు భవనాల అతిథిగృహాన్ని అభివృద్ధి పేరుతో కూల్చి కొత్తగా చేపలు, మటన్ మార్కెట్‌ను నిర్మించాలని తలపెట్టిన గత ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్రజా, కుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పూలే- అంబేద్కర్ జాతర కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సిములు మాట్లాడుతూ కళాశాలల చుట్టుపక్కన, దేవాలయాలకు దగ్గరలో, క్రైస్తవుల సమాధులు పక్కన మటన్, చేపల మార్కెట్ నిర్మించాలని తలపెట్టిన ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బదులుగా స్టడీ సర్కిల్ గానీ, గ్రంథాలయం గానీ, విద్యా వైజ్ఞానిక కేంద్రం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత క్రిష్టియన్ దండోరా ఉమ్మడి జిల్లా కన్వీనర్ మామిడి శామ్యూల్, మాలల ఐక్యవేదిక నాయకుడు రఘునాథ్, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జములమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నవంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, దాతలు

మక్తల్: పట్టణంలోని జములమ్మ ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా శుక్రవారం ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీద ప్రతిష్ఠాపన చేయించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, నూతన విగ్రహాన్ని నీటిల్లో ఉంచి జలవాది పూజలు చేశారు. రెండు రోజులుగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన మనసాని రత్నమ్మ, నర్సింహగుప్తాల జ్ఞాపకార్థం ఆలయాన్ని దాత వెంకటేష్ సరళ సొంత ఖర్చులతో నిర్మించారు. కార్యక్రమంలో కిరణ్ ప్రత్యూష , వేదపండితులు శ్యాంసుందర్, వంశీక్రిష్ణ, విజయేంద్ర, కార్తిక, రాఘవేంద్ర, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబాటుకు గతపాలకులే కారణం

నర్వ: మక్తల్ నియోజకవర్గ వెనకబాటుకు గత పాలకుల అసమర్థతే కారణమని ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరీ నేతృత్వంలో మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అధ్యక్షతన మండలంలో మూడో రోజు పాదయాత్రను రాయికోడ్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయికోడ్, పాథర్చేడ్‌లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్రను కొనసాగించారు. పాదయాత్ర సాయంత్రం నర్వకు చేరుకోగానే స్థానిక చాకలి ఐలమ్మ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నావాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలనుద్దేశించి నాయకులు మాట్లాడారు. ముందుగా మండలంలో చేపట్టాల్సిన పనులపై టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి పెద్దల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో బీటీకి నోచుకోని మూడు గ్రామాలకు బీటీ రహదారి, 30 పడకల ఆస్పత్రి, అంబులెన్స్ ఏర్పాటు, సాగునీటి కోసం ప్రధాన కాల్వల ఏర్పాటు, గురుకుల పాఠశాలను తిరిగి నర్వకు తీసుకురావాలని ఏకరువు పెట్టారు. అనంతరం ఎమ్మెలే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గ, మండల అభివృద్ధికి రూ. 1.25 కోట్లు మంజూరు చేయించి కేటాయించామన్నారు. అనంతరం వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేసి గెలిపించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి, శరణప్ప, బల్‌రాంగౌడ్, వివేకవర్ధన్‌రెడ్డి, నీరజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు.

పంటల సాగువిధానంపై అవగాహన

కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం విద్యార్థులకు చిత్తడి నేలల స్వభావం, పంటల సాగు విధానం తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థులతో కలిసి క్షేత్రస్థాయిలో చిత్తడి నేలల్లో వేసిన పంటలను పరిశీలించారు. చిత్తడి నేలల స్వభావం, పంటలు సాగుచేసే విధానం విద్యార్థులకు వివరించారు. అనంతరం చిత్తడి నేలలను కాపాడుకుందామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్తడి నేలలను పరిశీలిస్తున్న విద్యార్థులు

'చలో అభియాన్'ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోస్గి(మద్దూరు): బీజేపీ పార్టీ ఈ నెల 4నుంచి 11 వరకు చేపట్టే 'గావ్ చలో అభియాన్' కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్, నియోజకవర్గ కన్వీనర్ నర్సింహులు, కో కన్వీనర్ రాముయాదవ్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండలంలోని మండల బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త ఒక గ్రామానికి వెళ్లి గ్రామంలోని బీజేపీ నాయకులను, మద్దతుదారులను, సంఘాల నాయకులు కలిసి అక్కడున్న సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శంకర్, సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు సాయిలు, రాములు, రఘు, భరత్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

మరికల్: ఇటుక బట్టీల దగ్గర పిల్లలను పనిల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ అబ్దుల్ ఘని అన్నారు. శుక్రవారం మండలంలోని కన్మనూర్ శివారుల్లో ఉన్న ఇటుక బట్టీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇటుక బట్టీల దగర పని చేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రత్యేకంగా వర్క్ సైట్ స్కూల్ ఏర్పాటు చేసి విద్యను అందించాలన్నారు. అలా కాకుండా వారి చదువులకు ఆటంకం కలిగిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. అనంతరం గాజులయ్యతండా పాఠశాలను సందర్శించి ఆకాడమిక్ స్టాండర్స్ పెంచాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శివకుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇటుకబట్టీల వద్ద వర్క్ సైట్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

మక్తల్: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యాజమాన్యులపై చర్యలు తీసుకుంటామని లీగల్ అడ్వైజర్ కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని చందాపూర్‌లో వ్యవసాయ పొలం వద్ద చిన్న పిల్లలు పనులు చేస్తున్న సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకుని అవగాహన కల్పించారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు గురిచేసిన 1098నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కౌన్సిల్ విజయ, సుజాత, బాల్‌రాజు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

చిన్నచింతకుంట: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించే కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఏస్ దేవదానం కోరారు. శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డికి సమ్మెనోటీస్ అందజేశారు. కోళ్ల వెంకటన్న, బి. వేణుగోపాల్, సలాం వెంకటన్న పాల్గొన్నారు.



సమ్మెనోటీస్ అందిస్తున్న నాయకులు